ప్రజాశక్తి

శుక్రవారం 24 నవంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాఖకు షిఫ్టింగ్!

- ఎపి పాలనకు కేంద్ర బిందువుగా రుషికొండ?
- ఐటి హిల్స్ మిలీనియం టవర్‌లో ముఖ్యమైన రాష్ట్ర స్థాయి హెచ్ఒడిలు
- రుషికొండపై సిఎం క్యాంప్ ఆఫీస్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ వైపు రాష్ట్ర ప్రభుత్వం షిఫ్టింగ్ అడుగులు నెమ్మదిగా వేస్తోంది. తాజాగా అందుకు సంబంధించిన జీవో ఆర్‌టి నెంబర్ 2283ను విడుదల చేసింది. ఉత్తరాంధ్ర ముఖద్వారం విశాఖ నుంచి ప్రభుత్వం ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబరు నుంచి పరిపాలన చేసేందుకు సిద్ధంగా ఉందని గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారమే కార్యాలయాల అన్వేషణకు మరో జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. దాదాపు డిసెంబరులో అడుగు పెట్టే దిశగా కదలికలు కనిపిస్తున్నాయి. ఎపి పునర్విభజన చట్టం -2014 ప్రకారం రాష్ట్ర సమతుల అభివృద్ధికి సంబంధించిన సంక్షేమంపై రాష్ట్ర స్థాయి సీనియర్ అధికారుల సమీక్షకు అనువుగా విశాఖలోని రుషికొండ ఎ, బి బ్లాక్‌లు, ఇతర భవనాల అన్వేషణ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకునే దిశగా ప్రభుత్వ జీవో ఉంది. సిఎం క్యాంప్ ఆఫీసుకు సంబంధించి రుషికొండపై ఎపి టూరిజం ప్రాంగణం ఇప్పటికే దాదాపు సిద్ధమైంది. రోడ్లు, లైటింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంకా ఇంటీరియర్ డెకరేషన్స్ చేయాల్సి ఉంది. ఇంటీరియర్స్ కోసం రూ.150 కోట్ల మేర వెచ్చించే అవకాశం కనిపిస్తోంది. సీనియర్ అధికారుల కోసం భవనాలు, కార్యాలయాల అన్వేషణకు రుషికొండ ఐటి మిలీనియం టవర్స్ ఎ, బి, బ్లాక్‌లలో లక్షల చదరపు అడుగులు ఖాళీగా ఉన్నట్లు జీవోలో పేర్కొంది. సచివులు, ప్రభుత్వ సెక్రటరీలు, హెచ్ఒడిలు వారి వారి విభాగాల కోసం దాదాపు స్థలం ఖరారైనట్టే అని తెలుస్తోంది. ముఖ్యమైన ప్రభుత్వ శాఖలు రుషికొండ ఐటి మిలీనియం టవర్స్ ఎ,బిలలో సర్దుబాటు చేయనున్నారు. ప్రభుత్వ వివిధ విభాగాల రాష్ట్ర కార్యదర్శులు ఈ ఏర్పాట్లలో నిమగ్నం కావాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి ఈ మేరకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు శాఖల కార్యాలయాలకు భవనాలు ఇలా...

బిసి వెల్ఫేర్, సివిల్ సప్లయిస్, ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్, ఎనర్జీ, వుమెన్ అండ్ చైల్డ్ డిపార్టుమెంట్, ఫైనాన్స్, జిఎడి, ఉన్నత విద్య, ఇన్‌ఫ్రా అండ్ ఇన్వెస్ట్‌మెంట్, లేబర్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్, మైనారిటీ వెల్ఫేర్, ప్లానింగ్, సాంఘిక సంక్షేమ శాఖ, రియల్ టైం గవర్నెన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ తదితర శాఖలకు ఇంకా ప్రభుత్వ లేదా ప్రత్యామ్నాయ భవనాలు గుర్తించాల్సి ఉందని జీవోలో పేర్కొన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్‌కు భీమిలి డైట్‌ను కేటాయించారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలకు ప్రభుత్వ కార్యాలయాల లభ్యత ఉంది. పాత కార్యాలయాలనే రాష్ట్ర స్థాయి హెచ్ఒడిలు ఉండేందుకు అనువుగా మార్చనున్నారు. స్థల సమస్య కూడా ఈ శాఖలకు లేదని తెలుస్తోంది. ప్రత్యేకంగా విమ్స్ ఆసుపత్రిలో 20 రూములు పక్కకు ఉంచారు. ఇండస్ట్రీస్, ఎపిఐఐసి జోనల్ కార్యాలయాలు కంచరపాలెంలో సరిపడా స్పేస్‌లోనే ఉండడంతో రాష్ట్ర స్థాయి అధికారులు వీటినే వినియోగించనున్నారు.

అభ్యంతరాలున్నా పనులు...

ఎపిలో 3 రాజధానుల వ్యవహారం న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. పరిపాలనా రాజధాని విశాఖపైనా ఇక్కడ రుషికొండపై భవనాల నిర్మాణంపైనా కోర్టులో కేసులు నడుస్తున్నాయి. జరుగుతున్న పనులపైనా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. సుమారు రూ.350 కోట్లకు పైగా అంచనాలతో సిఎం క్యాంప్ కార్యాలయ భవంతులను సిద్ధం చేస్తున్నారన్నది ఆరోపణ ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎపి హైకోర్టులో

మిగతా 2లో..

మత్స్యకారులకు సంపూర్ణ సహకారం

బోట్లు దగ్ధం పరిహారం పంపిణీలో మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ)

ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమై నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. జిల్లా పరిషత్ అసెంబ్లీ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బోట్లు దగ్ధమైన వారికి, జీవనోపాధి కోల్పోయిన హమాలీలకు, చిరు వ్యాపారస్తులకు రూ.7.11 కోట్లు పరిహారాన్ని గురువారం మంత్రి సిదరి అప్పలరాజు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో హుదూద్, తిత్లీ తుపాను సమయంలో జరిగిన నష్టాలపై ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మత్స్యకార భరోసా ఇస్తున్నారని, డీజిల్ సబ్సిడీ పెంచి ఇస్తున్నారని, మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లిస్తున్నామని చెప్పారు.

తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, విపత్తులు వచ్చినప్పుడు మత్స్యకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. సంఘటనలో 30 బోట్లు పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగాను దెబ్బతిన్నాయని, వారందరికీ పూర్తి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారని చెప్పారు. ఇన్స్యూరెన్స్ లేని వారికి కూడా పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారని తెలిపారు. బోట్లు నష్టపోయిన మత్స్యకారులకు 80 శాతం నష్టపరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. బోట్లు యజమానులతో పాటు అందులో పని చేసే కళాసీలను కూడా ఆదుకోవాలని నాయకులు కోరడంతో వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు ఇప్పించే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదం జరిగిన నాలుగు రోజుల్లోనే నష్టపరిహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్ సబ్సిడీ విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

మిగతా 2లో..

పరిహారం పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కల్యాణమస్తు, షాదీ తోఫాతో ఆర్థిక చేయూత

వార్త 5లో..

లారస్ బస్సు -లారీ ఢీకొని 20 మందికి గాయాలు

వార్త 5లో..

రేషన్ డిపోల్లో కందిపప్పు సరఫరాను పునరుద్ధరించాలి

వార్త 6లో..

రిజర్వేషన్ల తొలగింపునకు కేంద్రం యత్నం : మిడియం

వార్త మెయిన్‌లో..

ఆనందోత్సవంలో భారత్ క్రికెటర్లు

అచ్చొచ్చిన మైదానంలో అదరహో..

ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ విజయం

వార్త 2లో...

రైల్వేల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి : భారతీయ రైల్వేల ప్రయివేటీకరణ తక్షణమే ఆపాలని సిఐటియు ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి రైల్వే స్టేషన్ల వద్ద గురువారం ధర్నా నిర్వహించారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం వద్ద ధర్నానుద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకు ప్రయాణం కల్పించి గమ్యస్థానానికి చేర్చుతున్న భారతీయ రైల్వేను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కారుచౌకగా అంబానీ, అదానీలాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారన్నారు. మోడీ గత 9 ఏళ్ళలో ఒక్క ప్రభుత్వరంగ సంస్థను కూడా ఏర్పాటు చేయకపోగా, ఉన్న సంస్థలను అమ్మేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. 150 రైళ్లు, రైల్వే ట్రాక్‌లు, రైల్వే స్టేషన్లను ఇప్పటికే మోడీ ప్రభుత్వం అదానీకి కట్టబెట్టడంతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రైల్వేలో మూడు లక్షలకు పైచిలుకు ఖాళీ పోస్టులుంటే వాటిని భర్తీచేయకుండా, నిరుద్యోగ యువతను తీవ్ర మోసం చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. అత్యధిక విలువైన ఆస్తులు కలిగి ఉన్న రైల్వే స్థలాలు, కల్యాణమండపాలు, పార్కులు, స్టేడియాలను సైతం కాజేసే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే పాసింజరు రైళ్లను రద్దుచేసి

మిగతా 2లో..

విశాఖ, అనకాపల్లి స్టేషన్ల వద్ద సిఐటియు ధర్నా

అనకాపల్లి రైల్వే స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

మొదటి పేజీ తరువాయి..

విశాఖకు షిఫ్టింగ్!

తెన్నేటి పార్కు ఎదురుగా కైలాసగిరి కొండను తొలిచే పనులు నిలుపుదల చేయాలని జనసేన కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ పిటిషన్ వేయగా హైకోర్టు స్టే ఇస్తూ పనులు ఆపాలని చెప్పినా ఎక్కడా పనులు ఆగడం లేదు. రాజధాని అన్న ప్రస్తావన లేకుండా సమతుల్య అభివృద్ధి కోసం విశాఖలో రాష్ట్ర స్థాయి ప్రభుత్వ శాఖల తరలింపునకు ప్రభుత్వం తాజాగా శ్రీకారం చుట్టింది.

మత్స్యకారులకు సంపూర్ణ సహకారం

వెంకటరమణ, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, వాసుపల్లి జానకిరామ్, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేల ప్రయివేటీకరణ ఆపాలి

హైస్పీడ్ రైళ్ళను పెంచడం, ఉన్న జనరల్ కోచ్‌లు, స్లీపర్ కోచ్‌లు తగ్గించి ఎసి కోచ్‌ల సంఖ్య పెంచి ప్రయాణికులపై పెనుభారాలు మోపుతున్నారన్నారు. రైల్వే ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే ప్రజలు మరింత ఇబ్బందులు పడే ప్రమాదముందని, ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాలని కోరారు. మోడీ కార్పొరేట్ నిర్ణయాలను రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన సమర్థించడాన్ని తప్పుపట్టారు. విభజన హామీలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. ప్రయివేటీకరణ జరిగితే రైల్వేజోన్ వచ్చినా ప్రయోజనం ఉండదని, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే విధంగా ప్రాంతీయ పార్టీలు తమ వైఖరి మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఎం.సుబ్బారావు, నాయకులు వై.రాజు, డి.కొండమ్మ, కె.పెంటారావు, ఒమ్మి అప్పారావు, కె.సత్యన్నారాయణ, కెవిపి.చంద్రమౌళి, యుఎస్ఎన్.రాజు, కె.కుమారి, ఎన్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరణ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల పన్నులతో రైల్వేను నిర్మించగా, దానిని ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. రైల్వే రంగాన్ని ఆదానీ లాంటి బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని మండిపడ్డారు. అందులో భాగంగానే ప్యాసింజర్ రైలు రద్దు చేశారని, చిన్న చిన్న స్టేషన్లను మూసేశారని, వందే భారత్, నమో భారతం వంటి రైళ్ల సంఖ్య పెంచి, దోపిడీ చేస్తుందని విమర్శించారు. రైల్వేలో మూడున్నర లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం వల్లే రైల్వే ప్రమాదాలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా రైల్వే రంగం ప్రభుత్వ రంగంలో ఉండగా, బీజేపీ ప్రభుత్వం మాత్రం మన దేశంలోని రైల్వేని ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. కావున ప్రజలందరూ బిజెపి విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, నాయకులు పరమేశ్వరరావు, డి శ్రీను, గంటా శ్రీరామ్, అప్పారావు, కళ్యాణం, సురేష్, ఉమామహేశ్వరరావు, తెలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యాన ఈ నెల 25 నుంచి విశాఖ 22వ పుస్తక మహోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. టర్నర్ చౌల్ట్రీలో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిఇఒ ఎల్.చంద్రకళ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి ప్రారంభిస్తారని బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు వెల్లడించారు. ఈ ప్రదర్శన డిసెంబర్ 15వ తేదీ వరకూ కొనసాగుతుందని తెలిపారు. సుమారు 40 వేల రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, అన్ని పుస్తకాలపైనా 10శాతం రాయితీ ఉంటుందని వివరించారు.

రెల్లి వీధిలో మద్యం షాపు వద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 37వ వార్డు పరిధి రెల్లివీధి అంబేద్కర్ కల్యాణ మండపానికి ఎదురుగా జెర్రిపోతుల ప్రసాద్ భవనంలో మద్యం షాపును ఏర్పాటు చేయడానికి నిరసిస్తూ గురువారం స్థానికులు, ఎవిఎన్ కాలేజీకి చెందిన కొంతమంది విద్యార్థులతో కలిసి 'చదువే ముద్దు మందు వద్దు' అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. వార్డు టిడిపి కార్యదర్శి రవిశంకర్, జనసేన అధ్యక్షుడు ఎర్రంశెట్టి సురేష్ కుమార్ నాయకత్వంలో రెల్లి సామాజిక తరగతికి చెందినవారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 8 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో మద్యం షాపు ఉండేదని, దానివల్ల నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, స్థానికులు ఆందోళన చేయడంతో రద్దు చేశారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు మద్యం షాపును స్థానిక వార్డు కార్పొరేటర్ తోడ్పాటుతో ఏర్పాటు చేస్తున్నారని వారు ఆరోపించారు.

అచ్చొచ్చిన మైదానంలో అదరహో..

ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ విజయం
ఎసిఎ - విడిసిఎ స్టేడియం పరిసరాలన్నీ కిటకిట

ప్రజాశక్తి - పిఎం.పాలెం : అచ్చొచ్చిన మైదానంలో భారత్ అదరగొట్టింది. బ్యాట్స్‌మెన్లు సత్తా చాటడంతో 209 పరుగుల లక్ష్యాన్ని రెండు వికెట్ల ఆధిక్యంతో భారత్ విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఆటలో గెలుపుతో ఈ టి-20 సిరీస్‌లో భారత్ బోణీ కొట్టింది. దీంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తరువాత మ్యాచ్లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని వారంతా ఆకాంక్షిస్తున్నారు.

విశాఖలో సందడి

భారత్ - ఆసీస్ జట్ల మధ్య గురువారం పిఎం.పాలెం ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో టి - 20 మ్యాచ్ నేపథ్యంలో సందడి నెలకొంది స్టేడియం క్రికెట్ అభిమానులతో మంగళవారం మధ్యాహ్నంనుంచే కిక్కిరిసిపోయింది. ఇండియా గెలవాలంటూ అభిమానులు ప్లకార్డులు, భారత్ జెండాలు ప్రదర్శించారు. భారత్ టీషర్టులు ధరించి స్టేడియం వద్ద కేరింతలు కొట్టారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమైన మ్యాచ్‌కు అభిమానులు మధ్యాహ్నం నుంచే ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చేశారు. రుషికొండలోని హోటల్ నుంచి స్టేడియంలోకి వచ్చిన క్రికెటర్ల వాహనాలకు ఘన స్వాగతం పలికారు. మ్యాచ్ ఏడు గంటలకు ప్రారంభమైనప్పటికీ క్రీడాభిమానులు టికెట్లు చేతపట్టుకుని స్టేడియం చుట్టూ 8:30 గంటల వరకు ప్రదర్శనలు చేశారు. మ్యాచ్ మొదలై మొదటి ఇన్నింగ్స్ పూర్తయినప్పటికీ స్టేడియం చుట్టూ భారీ సంఖ్యలోనే జనం గుమిగూడి కనిపించారు. సామాన్యులకు అందని తక్కువ ధర టికెట్లన్నీ స్టేడియం చుట్టుపక్కల అధిక సంఖ్యలో ఎక్కువ ధరలకు బ్లాక్‌లో అమ్ముడుబోయాయి. ఈ మ్యాచ్‌ను చూసేందుకు విశాఖతో పాటు శ్రీకాకుళం, ఒడిశా, జార్ఖండ్ నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు తరలివచ్చారు.

స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న అభిమానులు

రాణించిన ఆస్ట్రేలియా ఓపెనర్లు....

మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. ఏడు గంటలకు ప్రారంభమైన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆటగాళ్ల బ్యాటింగ్‌లో చెలరేగిపోయారు. 20 ఓవర్లకుగానూ 3 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేశారు. ఓపెనర్లు స్టీవెన్ స్మిత్ 41 బంతుల్లో 52 పరుగులతో అర్ధ సెంచరీ చేశాడు. 3వ స్థానంలో దిగిన జోష్ ఇంగ్లిష్ 50 బంతులలో 11 ఫోర్లు 8 సిక్సులతో 110 పరుగులతో చెలరేగిపోయాడు. 20 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 208 పరుగులు చేసి భారత్ జట్టు ముందు భారీ టార్గెట్‌ను ఉంచారు.

సత్తా చాటిన భారత్

తొలుత బ్యాటింగ్ బరిలోకి దిగిన భారత ఓపెనర్ బ్యాట్స్‌మెన్లు అంతగా రాణించలేకపోయినప్పటికీ మిడిల్ ఆర్డర్లో దిగిన ఇషాన్ కిషన్ 39 బంతులలో రెండు ఫోర్లు, ఐదు సిక్సులతో 58 పరుగులు, కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ 42 బంతుల్లో 9 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 80 పరుగులు చేసి అవుటయ్యాడు. వీరిద్దరూ అద్భుతమైన ఆటతీరుతో పరుగులు వర్షం కురిపించారు. వీరిద్దరి పార్ట్‌నర్ షిప్‌లో దాదాపు 138 పరుగులు చేయడంతో భారత్ జట్టుకు గెలుపుపై ఆశలు చిగురించాయి. మైదానం మొత్తం క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున సందడి చేస్తూ భారత క్రికెటర్లకు ప్రోత్సాహం అందించారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో స్టేడియంలోని క్రికెట్ అభిమానులు కేరింటలు కొట్టారు.

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి రాట ముహూర్తం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిరమాసోత్సవాల సందర్భంగా కార్తీక శుద్ధ ఏకాదశిరోజున పందిరి రాట వేసి మార్గశిరమాసోత్సవాలకు శ్రీకారం చుట్టారు. గురువారం ఈ రాట కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో వేశారు. అనంతరం అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఉత్సవ రాట కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు అమ్మవారి జాకెట్టు ముక్క, తాంబూలం, అమ్మ వారి ప్రసాదం, గాజులు పంపిణీ చేశారు. అమ్మవారి మార్గశిరమాసోత్సవం నిర్వహించేందుకు గురువారం నుంచి ఏర్పాట్లు ప్రారంభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపకమీషనరు, కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కె.సింహాచలం, ధర్మకర్తలు బొదిలపాటి సత్యరూపవాణి, బి.అనురాధ, ఎస్.సతీష్, ఎన్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రత్యేక ఆహ్వానితులు జి.ప్రకాష్, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజినీరు సిహెచ్‌వి.రమణ, సహాయ ఇంజినీరు కెఎస్ఎన్.మూర్తి, పర్యవేక్షకులు, ఎ.తిరుపతిరావు, ఎంవి.రమణ, జివివిఎస్‌కె.ప్రసాద్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రాట కార్యక్రమానికి వచ్చిన మహిళలకు అమ్మవారి జాకెట్‌తో తాంబూలం అందిస్తున్న కార్యనిర్వహణాధికారి శిరీష

విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విద్యార్థుల సాధికారత జగనన్నతోనే సాధ్యమంటూ గురువారం ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంస్కరణలతో రాష్ట్రం విద్యా కాంతులతో ప్రకాశిస్తుందన్నారు. విద్యార్థుల మేలు కోసం వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఒకడుగు ముందుకేస్తే ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగడుగులు ముందుకు వేసి అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ విద్యను ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నట్లు చెప్పారు.

ఓటు తీసినందుకు రూ.5 లక్షలు పరిహారమివ్వాలి

తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తన ఓటును ఓటర్ల జాబితా నుంచి తొలగించినందుకు రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన ఓటు హక్కును తొలగించడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భారత రాజ్యాంగం ఓటు పరిరక్షణ ప్రాథమిక హక్కుగా ప్రస్తావిస్తుందన్నారు. రానున్న ఎన్నికలలో ఓటమి భయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒక్క విశాఖ తూర్పు నియోజకవర్గంలోనే 40 వేల ఓట్లు గల్లంతు అయ్యాయన్నారు. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉందని, ప్రజలందరూ అప్రమత్తమై, తమ ఓటు హక్కు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఓటు హక్కు లేకపోతే అధికారులు ఫారం-6 ద్వారా మళ్ళీ కొత్తగా ఓటును ఇస్తామని చెప్తున్నారని, ఆ విధంగా ఓటు హక్కు తీసుకోవద్దని చెప్పారు. ఎప్పటి నుంచో ఉన్న పాత ఓటు హక్కును కాదని, కొత్తగా ఇవ్వడమేంటని ప్రశ్నించాలన్నారు. ఈ పరిస్థితులలో పాత ఓటు హక్కునైనా పునరుద్ధరించాలని, లేకుంటే డెత్ సర్టిఫికెట్ అయిన ఇవ్వాలని అధికారులకు డిమాండ్ చేయాలన్నారు. ఓటు తీసేసినందుకు పరిహారంగా రూ.5 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

NARSIPATNAM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

NARSIPATNAM MUNICIPALITY INVITES FOLLOWING TENDERS ON 'e'procurement Platform

Sl. No.	Grant Name and No. of Works	Tender Calling	Estimated (Rs. in lakhs	Download Strating Date & Time	Download Ending Date & Time
1	General Fund (1 Work)	1st Call Short Call)	Rs.5.00 Lakhs	24-11-2023 by 11.00 AM	27-11-2023 by 03.30 PM

For details logon to: www.apeprocurement.gov.in
Contacts Ph.No. 98489245129, 9494189575
Sd/- COMMISSIONER
Narsipatnam Municipality

IN THE HON'BLE COURT OF VIITH ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
A.S. NO. 217/2022

Between:
Shri Manda Rama Krishna Reddy
... Appellant / Plaintiff
And:
Smt. Attada Sailaja Venugopal
... Respondent / Defendant

NOTICE TO RESPONDENT/DEFENDANT

To
Smt. Attada Sailaja Venugopal
W/o Venugopal Naidu
Proprietrix, "Sai Theertha Builders"
Door No 47-01-106, Shop No.3
Prime Rose Building, 6th Lane
Near Kala Hospital, Dwarakanagar
Visakhapatnam

Please take notice that the above named Appellant filed the above appeal against you for the Decree and Judgment in OS No. 190/2020 on the file of the Principal Junior Civil Judge at Visakhapatnam for recovery of amount and damages which was decreed partly. The above matter stands posted for your notice on **12-12-2023 at 10.30 AM** Hence you are hereby summoned to appear before the above mentioned Hon'ble Court either in person or through your counsel without fail, else the matter will be determined in your absence basing on the material available in the Court

D.SIVA PRASAD
K.ESWARA PRASAD
C.VENKATESH
Advocates, T-3, Third Floor Classic Plaza, Madhava Rd, Dabagardens
Visakhapatnam-530020
Cell No. 9948190560
Visakhapatnam
Dt. 23-11-2023

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ డిఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆయోధ్య నగర్, ఆర్‌టిసి కాలనీ, మానం ఆంజనేయుల కాలనీ, సాక్షి పేపర్ ఏరియా, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు విద్యార్థుల భద్రతపై ఓరియంటేషన్

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థుల భద్రతపై ఈనెల 24న ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్టు డిఇఒ ఎల్.చంద్రకళ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో రెవెన్యూ, ట్రాన్స్ పోర్టు, పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపక శాఖ, విపత్తుల నివారణ శాఖ అధికారులు పాల్గొంటారన్నారు. జిల్లాలోని అన్ని ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పక హాజరు కావాలని కోరారు.

గణిత ఉపాధ్యాయులకు శిక్షణ

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్స్

ప్రజాశక్తి -ఆనందపురం: అభ్యసనాభివృద్ధి (ఎల్ఇపి)పై ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని గణిత ఉపాధ్యాయులకు స్థానికజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. కోర్స్ డైరెక్టర్ స్థానిక ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తరగతి గదిలో సరళమైన రీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా గణితం బోధనపై రెండు రోజులు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న అంశాలను తరగతి గదిలో అమలపరిచి ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు కేజియా, కె.శ్రీనివాసరావు, సిఆర్‌పి శివాజీ, ఆనందపురం, పద్మనాభం మండలాల గణిత టీచర్లు పాల్గొన్నారు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని మద్ది సాధువుల మఠం సత్యనారాయణ స్వామి దేవాలయంలో కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని ఎంపిపి రాంబాబు ఆధ్వర్యంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. 45 మంది జంటలు పాల్గొనగా, మద్ది గ్రామ పురోహితులు బాలు వాసు వ్రతాలను నిర్వహించి, ప్రసాదవితరణ చేపట్టారు. కార్యక్రమంలో మద్ది సర్పంచ్ బి సన్యాసమ్మ, సత్యనారాయణ, గోవింద పాల్గొన్నారు.

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన బాబా జయంతోత్సవాల్లో భాగంగా ఈ నెల 19 నుంచి 23 వరకు స్థానికంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం గర్భిణులకు పౌష్టికాహా రం, వృద్ధులకు దుప్పట్లు, హాస్టల్ పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సమితి పూర్వ కన్వీనర్ చంద్రరావు, ప్రస్తుత కన్వీనర్ జి సత్యనారాయణ, పలు విభాగాల కోఆర్డినేటర్లు బాబా, సంతోష్, సత్యసాయి పాల్గొన్నారు

పోలమాంబ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించనున్న జివిఎంసి మూడోవార్డు ఎగువపేట మత్స్యకారుల ఆరాధ్యదైవం పోలమాంబ ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు పాల్గొన్నారు

గీతం విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ లోని ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన ఆవిష్కరణలను 'మేకర్స్ స్పేస్' పేరిట గురువారం ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ కోచ్ బి.రాజ్‌కుమార్ మార్గదర్శకంలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు తమ ఆలోచనలకు ఆవిష్కరణల రూపం ఇచ్చారు. స్మార్ట్ హెల్మెట్, రోబోఐ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సెక్యూరిటీ సిస్టమ్ వంటివి ప్రదర్శనగా ఉంచారు. గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్లు ప్రొఫెసర్ సి.విజయశేఖర్, ప్రొఫెసర్ రామశాస్త్రి, డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్ తదితరులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులలో స్టార్టప్ ఆలోచనలను ప్రోత్సహించడానికి

గీతంలో 'మేకర్స్ స్పేస్' ప్రదర్శన

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం, పలు పారిశ్రామిక సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని స్టార్టప్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు.

టిడిపి, జనసేన కూటమి గెలుపు అవసరం

బాబు ష్యూరిటీలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ: వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి గెలుపు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గురువారం జివిఎంసి 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని వివరాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, మజ్జి మాల్‌నాయుడు, రామ్మోహన్‌నాయుడు, నీలాపు జోగి, డొప్ప సన్యాసిరావు, ఎ.చంద్రశేఖర్, కోరుబిల్లి రాము, పెంటకోట హరికుమార్, పోతబత్తుల శ్రీను, నర్సింగరావు, సేనాపతి రాము, సన్నాటి లక్ష్మి, వర, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెండితెర విలక్షణ నటుడు చంద్రమోహన్

ప్రజాశక్తి -గోపాలపట్నం : వెండితెర విలక్షణ నటుడు చంద్రమోహన్ మరణం తెలుగు చలనచిత్ర రంగానికి తీరని లోటని గోపాలపట్నం కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు అన్నారు. గురువారం గోపాలపట్నం కళాపీఠం కార్యాలయంలో చంద్రమోహన్ సంస్మరణ సభ నిర్వహించారు. చంద్రమోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగు తెరపై చంద్రమోహన హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా, కొన్ని చిత్రాల్లో హాస్యనటుడిగా విలక్షణ పాత్రల్లో నటించి, ఆల్‌రౌండర్ అనిపించుకున్నారన్నారు. కళాపీఠం అధ్యక్షులు గోరకల రామదాసు మాట్లాడుతూ చంద్రమోహన్ నటుడిగా తన పాత్రలకు సహజత్వాన్ని తీసుకొచ్చారని, అనేక డీగ్లామర్ పాత్రల్లోనూ నటించి ఒప్పించారన్నారు. కార్యక్రమంలో

చంద్రమోహన్‌కు నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు

కళాపీఠం మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు, ఉపాధ్యక్షులు మిద్దె అప్పారావు, రంగస్థలం నటుడు గులిమి అప్పారావు ధన్వాల్ గజేంద్ర, బల్ల రమణ పాల్గొన్నారు.

మత్స్యకారులకు జనసేన అండ

నేడు బాధితులకు అధినేత పవన్‌కల్యాణ్ పరామర్శ

ఒక్కో కుటుంబానికి రూ.50వేలు చొప్పున ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి -సీతమ్మధార : మత్స్యకారులకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 24న శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని, బోట్లు కాలిపోయిన 49మత్స్యకార కుటుంబాలను పరామర్శించి, ఒక్కొక్కరికీ రూ.50వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారన్నారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు కాలిపోయిన మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. రూ.30 కోట్ల వరకు నష్టం వాటిల్లితే, కేవలం రూ.ఏడు కోట్లు చెల్లించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు మాట్లాడుతూ 49 చేపల బోట్లు కాలిపోగా, వాటిపై ఆధారపడిన 600 కుటుంబాలకు నష్టపరిహారం

మాట్లాడుతున్న జనసేన నేత పంచకర్ల, ఇతర నేతలు

అందజేయాలని డిమాండ్ చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో తరచూ ప్రమాదాలు, ఆరునెలల వ్యవధిలో రెండు హత్యలు జరిగాయని, దీనిపై తగు రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో జనసేనకార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, కందుల నాగరాజు, జనసేన పార్టీ ఉత్తరం ఇన్‌ఛార్జి వసుపులేటి ఉషాకిరణ్, అంగ ప్రశాంత్, గుగ్గులయ్య, నాగలక్ష్మి, అప్పారావు, ముగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ప్రకటించాలి

ప్రజాశక్తి- మాధవధార : నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డిఎస్‌సిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎపుడు ప్రకటిస్తారో చెప్పాలని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి చైర్మన్ మూల వెంకటరావు ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి 52 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి నిర్వహించారాష్ట్ర విభజన తరువాత గత ప్రభుత్వం 2018లో 7వేల ఉపాధ్యాయ పోస్టులతో డిఎస్‌సి నిర్వహించిందన్నారు. గడిచిన ఏడేళ్లుగా డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు బిఇడి, డిఇడి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులు దాదాపు ఐదు లక్షలమంది రాష్ట్రంలో ఉన్నారని, వీరిలో మూడు లక్షలమంది టెట్ అర్హత పరీక్ష పాసయ్యారన్నారు. ఏటా జనవరిలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించిన వైసిపి, డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఎపుడు విడుదల చేస్తుందాయని వీరంతా ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఉపాధ్యాయ శిక్షణ అనంతరం లక్షలు పెట్టి కోచింగ్‌కు వెళ్లిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం తక్షణమే 30వేల ఖాళీలతో డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. నాడునేడు నిధులతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను కల్పించిన ప్రభుత్వం, డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వపాఠశాలల్లో నాణ్యమైన, మెరుగైన విద్యను అందించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ భవనాల ఆధునికీకరణ

ప్రజాశక్తి-పెందుర్తి: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యాలయాల భవనాలకు మరమ్మతులు చేపట్టి, ఆధునికీకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. గురువారం రూ.ఐదు లక్షలతో మరమ్మతులు చేసి, అదనపు సౌకర్యాలతో ఆధునికీకరించిన పెందుర్తి తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయ భవనాలకు దాతల సహకారంతో మరమ్మతులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ హుస్సేన్, తహశీల్దార్ శ్యామ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి- సింహాచలం: క్షీరాబ్ది ఏకాదశిని పురస్కరించుకొని సింహాద్రి కొండపైన అప్పన్న ఆలయంలోనూ, కొండ దిగువ వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తారు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఏకాదశి సందర్భంగా సాయంత్రం స్వామి దర్శనాలు నిలిపివేశారు.

పెందుర్తి : 94వ వార్డు రవినగర్ కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి పురస్కరించుకొని స్వర్ణపుష్పార్చన, అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హరినామ సంకీర్తన నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపారాధన చేశారు. అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అప్పన్నను దర్శించిన భారత క్రికెటర్లు

అప్పన్నను దర్శించిన క్రికెటర్లు

ప్రజాశక్తి - సింహాచలం: సింహాద్రి అప్పన్నను గురువారం భారత క్రికెట్ జట్టు టి20 ఆటగాళ్లు వాషింగ్టన్ సుందర్, తిలక్‌వర్మ, మాజీ క్రికెటర్ గౌరీశంకర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్యులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం, బేడామండప ప్రదక్షిణ, స్వామి అంతరాలయం, గోదాదేవి సన్నిధిలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. మంత్రాలయంలో అర్చకులతో కలిసి గోవింద నామస్మరణ చేశారు. ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు దుశ్శాలువాతో సత్కరించి, స్వామి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు.

టిడిపిలోకి 25 వైసిపి కుటుంబాల చేరిక

పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజబాబు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని చందక పంచాయతీకి చెందిన 25వైసిపి కుటుంబాలు గురువారం భీమిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. చందక పంచాయతీకి వైసిపి మాజీ సర్పంచ్ రెడ్డి సీతయ్య, సర్పంచ్ అభ్యర్థి దొంతల అప్పలనాయుడు, కోఆపరేటివ్ డైరెక్టర్, మాజీ సర్పంచ్ పాలూరి అప్పలస్వామి, మాజీ వార్డు సభ్యుడు కొండ్రోతు అప్పలనారాయణ, తిమనాని సత్యనారాయణ, అమ్మాజీరావు, దొంతల శ్రీరామ్, దొంతల బంగారునాయుడు, లోలుగు కృష్ణ, దొంతల జగన్నాథం, బోధ చిన్నసత్యం, బోధ అప్పారావు, కొండ్రోతు శ్రీను, కొండ్రోతు రాజు, కణితి త్రినాథ్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కనకరాజు, బుర్ల పైడిరాజు, తదితర 25 కుటుంబాలకు చెందిన వారు తెలుగుదేశం మేనిఫెస్టోకు, భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల సత్యనారాయణ, గొట్టిపల్లి ఎంపిటిసి దొంతల కనకరాజు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి- గాజువాక: జివిఎంసి 76వ వార్డులో రూ.1.87కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వార్డు ఇన్‌ఛార్జి దొడ్డి రమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోని వార్డులన్నిటినీ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జగనన్న పనిచేస్తున్నారని, ఇప్పటివరకు 75శాతం పనులు జరిగాయని, మిగిలిన పనులన్నీ త్వరితగతిలో పూర్తి చేస్తామని అన్నారు. వార్డు ఇన్‌ఛార్జి దొడ్డి రమణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వార్డులో అనేక అభివృద్ధి పనులు చేసిన ఘనత ఎమ్మెల్యే నాగిరెడ్డిదేనన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బొడ్డు నరసింహ పాత్రుడు, ప్రమీల నరసింహ మూర్తి, కాకినాడ పెంటారావు, భవాని, చిక్క సత్యనారాయణ, చెల్లుబోయిన నాయుడు, గాలి బాబూరావు, కాకుళ్ల మురళి, గొంప రమేష్, పత్రిదేవి, శ్రవణకుమార్, పల్లం గోపి, గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తెంటు సత్యనారాయణ, అధ్యక్షులు గొర్లి రాములునాయుడు, బాసంగి తిరుపతిరావు, యడ్ల అప్పలనారాయణ పాల్గొన్నారు

ఎండోస్కోపిక్ సర్జరీపై శిక్షణ

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య కళాశాలలోని స్కిల్ ల్యాబ్ ఆధ్వర్యంలో 'ఎండోట్రైనర్' పేరిట ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స విధానాలపై గురువారం నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిమ్సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి హజ్రా దిశానిర్దేశం చేశారు. వైద్యరంగంలో వస్తున్న సాంకేతిక మార్పులపై అవగాహన పెరగడానికి ఈ తరహా శిక్షణ దోహదపడుతుందన్నారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు వైద్య కళాశాలలోని నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. వివిధ వైద్య కళాశాలల నుంచి జూనియర్ రెసిడెంట్ వైద్యులు, శస్త్రచికిత్సను బోధించే వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

విజేతలుగా బాలురు విభాగంలో కడప, బాలికల విభాగంలో అనంతపురం జట్లు

ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ట్రోఫీలతో కడప బాలురు, అనంతపురం బాలికల జట్లు

ప్రజాశక్తి -తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన భీమిలి ఫుట్‌బాల్ గ్రౌండ్, చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్, అమేయా వరల్డ్ స్కూల్‌లో నిర్వహించిన 67వ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 21న ప్రారంభమైన ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన 14 ఏళ్ల లోపు 468 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా సాగిన పోటీల్లో బాలుర విభాగంలో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టు విజేతగా నిలిచాయి. బాలుర విభాగంలో అనంతపురం, బాలికల విభాగంలో కర్నూలు జట్లు రన్నరప్‌గా నిలిచాయి. బాలుర విభాగంలో విశాఖ జిల్లా జట్టు, బాలికల విభాగంలోవైఎస్ ర్ కడప జిల్లా జట్టు 3వ స్థానంలో నిలిచినట్లు ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి నాగేశ్వరరావు తెలిపారు. 52 మంది కోచ్‌లు, మేనేజర్లు, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, 20 మంది రిఫరీలు సహకరించారు.

విజేతలకు షీల్డులు అందజేత

గురు వారం సాయంత్రం స్థానిక అమేయ వరల్డ్ స్కూల్‌లో జరిగిన ముగింపు వేడుకలో విజేతలకు జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ బొడ్డేపల్లి రాము షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గెలుపోటములను ఒకేలా స్వీకరించాలని, పోటీతత్వం, క్రీడాస్ఫూర్తిని అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసంతో రాణిస్తే భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు ప్రభాకర్, విశాఖ, అనకాపల్లి జిల్లాల వ్యాయామ సంఘం అధ్యక్షులు అప్పలరాజు, లలిత్‌కుమార్, కెఎం నాయుడు, కిరణ్‌కుమార్, సతీష్, కోలా చంద్రశేఖర్ పాల్గొన్నారు

ఎస్‌సి వర్గీకరణ ముగిసిన అధ్యాయం

మాట్లాడుతున్న భాగం గోపాలరావు

ప్రజాశక్తి-భీమునిపట్నం: ఎస్‌సి వర్గీకరణ అంశమనేది ముగిసిన అధ్యాయమనిమాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు అన్నారు గురువారం భీమిలిలో విలేకరులతో మాట్లాడుతూఎస్‌సి వర్గీకరణ అమలుకు కట్టుబడి ఉన్నామని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తూ దేశ ప్రధాని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏ ళ్ళు గడిచినా నేటికీ దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం జేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుండడంతో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు దూరమయ్యే అవకాశం ఉందన్నారు.ప్రైవేట్‌రంగంలో కూడా ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ములుగా ఉంటున్న మాల, మాదిగలను విడదీయాలన్న ఆలోచన సరికాదని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ మాదిగకు హితవు పలికారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భాగం లక్ష్మీ, ఎం శివ, కె ఈశ్వర్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు

ఆర్‌టిసి డ్రైవర్ మృతి కేసులో న్యాయం కావాలి

నిరసన తెలియజేస్తున్న ఆర్‌టిసి కార్మికులు, కుటుంబసభ్యులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : దళిత ఆర్‌టిసి డ్రైవర్, చింతా నాగేశ్వరరావు మృతి కేసులో న్యాయం కావాలని పలు దళిత, ప్రజా, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం సింహాచలం రోడ్ లోని ఆర్‌టిసి సింహాచలం డిపో వద్ద సింహాచలం 5వ వర్ధంతిసభను ఏపీఎస్‌ఆర్టీసీ (ఏపీపీటీడీ) ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నాగేశ్వరరావు చిత్రపటానికి కుటుంబ సభ్యులు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ,చింతా నాగేశ్వరరావు బలవన్మరణం ఘటన జరిగి ఐదేళ్లయినా నేటికీ న్యాయం జరగకపోవడం దారుణమన్నారు.డ్రైవర్ మృతికి కారణమైన నాటి డిపో మేనేజర్ దివ్యపై ఇప్పుడు వరకు యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ తన చావుకు డిపో మేనేజర్ కారణమని స్వదస్తూరితో రాసినా చర్యలు లేకపోవడం దారుణమన్నారు. విశాఖ జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మాట్లాడుతూ ఘటనపై ఐపిసి 306, ఎస్‌సి,ఎస్‌టి అత్యాచార చట్టం కింద కేసులు నమోదు చేసినా తదుపరి చర్యలేకపోవడం శోచనీయమన్నారు. ఆర్‌టిసి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ యన్ ధర్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎ .రావు మాట్లాడుతూ కార్మికులపై డిఎం దివ్య వేధింపులకు వ్యతిరేకంగా పోరాడి నాగేశ్వరరావు బలయ్యారన్నారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎం. లక్ష్మీ, చింతా నాగేశ్వరరావు భార్య అమ్మాజీ, సింహాచలం డిపో గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి బివై.రత్నం, అధ్యక్షుడు బి.ఎ. రావు,కార్యదర్శి ఎస్ గురువయ్య, రీజనల్ అధ్యక్షుడు భీమయ్య, పిఎస్. నారాయణ,. అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.సుజాత, పి సుష్మ, ఎం. వి.లక్ష్మి సిహెచ్ రావు, సిహెచ్ ఆనందరావు పాల్గొన్నారు. అనంతరం సభా స్థలం నుండి సింహాచలం ఆర్‌టిసి డిపో వరకు ర్యాలీ నిర్వహించి, డిపో గేటు వద్ద నిరసన చేపట్టారు.

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె!

సమ్మె బ్యాలెట్‌లో స్పష్టం చేసిన కార్మికులు

ప్రజాశక్తి- ములగాడ : పాత పెన్షన్ పునరుద్ధరణ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీల భర్తీ, కార్మిక వర్గంపై దాడులను అరికట్టడం, బేషరతుగా కారుణ్య నియామకాలు చేపట్టడం వంటి డిమాండ్లను డిసెంబర్ నెలాఖరులోగా సమ్మెకు సిద్ధం కావాలని ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఈ నెల 20, 21 తేదీలలో కేంద్రంలోని అన్ని డిఫెన్స్ యూనిట్లలో సమ్మె బ్యాలెట్ నిర్వహించగా, 98.8శాతం మంది సమ్మెకు వెళ్లాలని ఓటేశారని వెల్లడించారు. ఈస్ట్రన్ నేవల్ కమాండ్ వ్యాప్తంగా నిర్వహించిన సమ్మె బ్యాలెట్‌లో 3850 సభ్యులు పాల్గొనగా, వీరిలో 3804(98.8శాతం) మంది సమ్మెకు అనుకూలంగా ఓటు చేయగా, కేవలం 46 (1.19శాతం) మంది సమ్మెను వ్యతిరేకించారన్నారు. సమ్మె బ్యాలెట్‌లో పాల్గొన్న నేతలు, కార్మికులకు ఎన్‌సిఇ యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

రఘురాజు పాదయాత్రకు సంఘీభావం

పాదయాత్రలో పాల్గొన్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార: జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ విజయనగరం జిల్లా ఎస్ కోటకు చెందిన ఎమ్మెల్సీ రఘురాజు ఈనెల 8న విజయ నగరం జిల్లా బొడ్డవరంలో నుంచి చేపట్టిన చలో తిరుపతి పాదయాత్రకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కెకె.రాజు సంఘీభావం తెలిపారు.వచ్చే నెల 21న తిరుమల చేరుకోనున్న పాదయాత్ర, భీమడోలు వద్ద కొనసాగుతున్న నేపథ్యంలో అక్కడకు వెళ్లిన కెకె.రాజు, కొంతసేపు పాదయాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ రఘురాజుకు సంఘీభావం తెలిపారు. కెకె.రాజుతోపాటు జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, అంబటి శైలేష్, సునీల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్‌ఐగా భాస్కరరావు

ప్రజాశక్తి - సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఎస్‌ఐగా ఎన్.వి.భాస్కరరావు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో వన్ టౌన్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించిన భాస్కరరావు బదిలీపై ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో నియమితులయ్యారు. ఎస్‌ఐ భాస్కరరావుకు ద్వారకా పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కాపుల వనసమారాధనకు విరాళాల సేకరణ

విరాళం అందజేస్తున్న కార్పొరేటర్ రామారావు, తదితరులు

ప్రజాశక్తి- గాజువాక : స్థానిక శ్రీ కృష్ణదేవరాయకాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అప్పికొండ బీచ్‌లో వచ్చేనెల 24న నిర్వహించే కాపు వనభోజన సమారాధనకు గురువారం నుంచి విరాళాల సేకరణ చేపట్టారు. సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు, ప్రధాన కార్యదర్శి తలారి వెంకటరమణ సారధ్యంలో. మొదటగా 72వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావును కలవగా, కాపుల వనసమారాధనకు రూ.పది వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, ఆరేళ్లుగా క్రమంతప్పకుండా అప్పికొండలో నిర్వహిస్తున్న కాపుల వనసమారాధనలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కరణం బాబూరావు, ముమ్మన అప్పారావు, గొన్న తాతారావు, గోపిశెట్టి సత్యారావు, వింధుల నరసింగరావు, గొల్లవిల్లి నూకరాజు, మిద్దె రమేష్, తలారి మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

లారస్ బస్సు, రెడీమిక్స్ లారీ ఢీకొని

20 మంది కార్మికులకు గాయాలు

నుజ్జు అయిన రెడీమిక్స్ లారీ ముందు భాగం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని సెజ్ ప్రధాన రహదారిలో కుమారపురం జంక్షన్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద గురువారం మధ్యాహ్నం కాంక్రీట్ రెడీమిక్స్ లారీ, లారస్ ఫార్మా కంపెనీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారస్ బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది కార్మికులకు గాయాలయ్యాయి. వారిలో ఇద్దరు పరిస్థితి సీరియస్‌గా ఉంది. స్థానికులు, కార్మికులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎస్ఇజెడ్‌లోని లారస్-2 మందుల పరిశ్రమలో కార్మికులు ఎ షిఫ్ట్ విధులు ముగించుకొని బస్సులో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. కుమారపురం జంక్షన్ సమీపంలో పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న డైవర్షన్ వద్ద బస్సు డ్రైవర్ బస్సును కుడివైపు ఉన్న పెట్రోల్ బంక్‌కు వెళ్లేందుకు తిప్పుతుండగా, అవతల రోడ్డులో ఎదురుగా వస్తున్న శర్వాణి రెడీమిక్స్ లారీ లారస్ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న లారస్ కంపెనీకి చెందిన 20 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో వారిని విశాఖ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. లారస్ బస్సు డ్రైవర్, రెడీమిక్స్ లారీ డ్రైవర్ ఇద్దరు డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కార్మికులు చెబుతున్నారు. దీనిపై అచ్యుతాపురం సిఐ మురళీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులకు సిఐటియు నేతల పరామర్శ

ప్రమాదంలో గాయాలైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. హాస్పిటల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాము పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాద్ అనే కార్మికుని తలకు తీవ్ర గాయం కావడంతో స్పృహ కోల్పోయాడని తెలిపారు. ప్రమాద సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీవ్ర గాయాలు పాలైన కార్మికులు కోలుకునే వరకు పరిశ్రమ యాజమాన్యం వారికి వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ ఏర్పాట్లు చేయలేని పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమగ్ర విచారణ జరపాలి : సిఐటియు జిల్లా కమిటీ

అనకాపల్లి ప్రతినిధి : లారస్ 2 ఫార్మా బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణచేసి ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఆర్.శంకర రావు, జి.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడ్డ కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం ఆదుకోవాలని కోరారు. బస్సు ప్రమాదాలు పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

కళ్యాణమస్తు, షాదీ తోఫాతో ఆర్థిక చేయూత

- కలెక్టర్ ఎ.మల్లికార్జున
-విశాఖ జిల్లాలో రూ.1.57 కోట్లు, అనకాపల్లిలో రూ.2.14 కోట్లు సాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

విశాఖ జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, వికలాంగులు, భవన కార్మికుల కుటుంబాల్లోని ఆడ పిల్లలకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా వారి తల్లుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమచేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా నాలుగో విడత నిధుల పంపిణీని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమచేశారు. జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జులై నుంచి సెప్టెంబర్ 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 255 మంది లబ్ధిదారులకు రూ.కోటీ 57 లక్షలా 50 వేలను పంపిణీచేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు పి.సుజాత, బి.పద్మావతి, ఎం.మాధవి వర్మ, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ పి.చిన్నతల్లి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్.శోభారాణి, జిల్లా బిసి.సంక్షేమాధికారి కె.శ్రీదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్.జ్యోతిమాధవి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇంచార్జ్ పూర్ణిమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో చెక్కు అందిస్తున్న జెసి జాహ్నవి

అనకాపల్లి జిల్లాలో 350 మందికి..

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా 350 జంటలకు ఆర్థిక సాయంగా రూ.2 కోట్ల 14 లక్షల 25 వేలు ఇస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం కల్పిస్తున్న కళ్యాణమస్తును వినియోగించుకోవాలని కోరారు. అంతకుముందు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అర్హులైన జంటలకు ముఖ్యమంత్రి ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి డైజీ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్‌బాబు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక మహాధర్నాపై ప్రచారం

మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేత ఎర్రా దేముడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆలిండియా రైతు సంఘాలు పిలుపుమేరకు ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరుగు మహాధర్నాపై మండలంలోని సూరెడ్డిపాలెంలో గురువారం కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షకులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. విజయవాడలో జరుగు మహా ధర్నాకు కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి రాజు, సూరెడ్డి మల్లు నాయుడు, దేవుడమ్మ, రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక రూరల్ : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం ఆవరణలో విజయవాడలో జరిగే మహా ధర్నా గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ పేద, సామాన్య ప్రజల కంటే బడా కార్పొరేట్ సంస్థలకు, కోటీశ్వరులకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాలను మార్పు చేసి లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేశారన్నారు. కనీస మద్దతు ధర ప్రకటించక పోవడం సరి కదా విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి రైతు నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎస్. బ్రహ్మాజీ, అంజలి, పద్మ సరస్వతి, రాజేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : విజయవాడ జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని గోడ పత్రికను కసింకోటలో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, ఎండిఎం, ఐద్వా, ముఠా, ఏపీఈపీడీసీఎల్, కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విజయవాడలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహా ధర్నా జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, అంగన్వాడీ నాయకులు తనుజ, శ్యామల, ఏపీ ఈపీడీసీఎల్ నాయకులు కే శ్రీనివాసరావు, ఎండిఎం నాయకులు శ్రీదేవి, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి ముఠా కార్మిక సంఘం నాయకులు బి. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, అనుబంధ సంఘాల నేతలు

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఈ నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు రక్తహీనతపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత గల విద్యార్థులు క్రమం తప్పకుండా మాత్రలు వేసుకోవాలన్నారు. ఆగస్టు నెలలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా 95.5శాతం విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారని, ప్రస్తుతం 50.5 శాతానికి తగ్గ ముఖం పట్టిందని హెచ్ఎం ఎస్వీ పద్మావతి వివరించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా రాగి జావా, కోడి గుడ్లు అందించాలని స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. మధ్యాహ్నం భోజన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1, 2 సత్యనారాయణ డివిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భాషాభివృద్ధిపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యార్థులకు భాషాభివృద్ధి, పరిజ్ఞానంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఎనిమిది నుండి పదవ తరగతి చదువుకున్న విద్యార్థులను ఇంగ్లీషు భాషపై పలు ప్రశ్నలు అడిగారు. ఎంఈఓ 1, 2 కే సత్యనారాయణ, డివిడి ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కె కోటిపాడు హైస్కూల్ విద్యార్థిని వి.లక్ష్మి ప్రథమ బహుమతి సాధించగా, కొరువాడ హైస్కూల్ విద్యార్థిని వి.నందిని ద్వితీయ బహుమతి సాధించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు సీఎం నాయుడు, జె.రమేష్, యు. స్వర్ణలత వ్యవహరించారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం బవులువాడ పంచాయతీ పరిధిలోని సీతమ్మ కాలనీ నుండి చోడవరం మెయిన్ రోడ్ వరకు జిజిఎంపి నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌పి గ్రామ పార్టీ అధ్యక్షుడు మజ్జి వెంకట అప్పారావు, ఎఎంసి డైరెక్టర్ దాడి కుమార్, రామకృష్ణ, కన్నారావు, ఎంపీటీసీ తోటాడ విజయ్, సచివాలయం కన్వీనర్లు, వార్డు సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కులగణన అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పరవాడ : కుల గణన, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, గొర్లెవానిపాలెం సర్పంచ్ గొర్లె గోపి అమ్ములు, ఎంపీటీసీ వరలక్ష్మి, ఎరుకు నాయుడు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పల నాయుడు, వై.సి.పి నాయకులు కంచి పాటి భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా ఎస్‌హెచ్‌జిలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొల్లు రవీంద్రను కలిసిన నాయుడు

ప్రజాశక్తి-దేవరాపల్లి : టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లు రవీంద్రను గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాడుగుల నియోజకవర్గం టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు కర్రి సింహాద్రి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మాడుగుల నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల గురించి రవీంద్రకు విన్నవించినట్లు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల కోటపై తెలుగుదేశం జెండా ఎగరడం ఖాయమని నాయుడు అన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు పూర్తిగా అన్యాయమే జరిగిందని వివరించినట్లు వెల్లడించారు.

సెల్ టవర్ ఏర్పాటు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి పంచాయితీ శివారు సమ్మెద గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేశారు. ఇటీవలే డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినప్పుడు, ఇక్కడ సెల్ టవర్ సిగ్నల్ లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఆ పంచాయతీ వాసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన సెల్ టవర్ నిర్మాణ ఏర్పాట్లను పూర్తి చేయించారు. మంత్రి ముత్యాలనాయుడుకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయుర్వేద వైద్య అధికారి లావణ్య అన్నారు మండలంలోని తీడ స్కూల్ లో ఆయుర్వేదము, యోగాపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలుబు తలనొప్పి జ్వరం ఇతర సంబంధిత రోగాలు సీజన్‌గా వస్తాయని తెలిపారు. అనంతరం ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, శిక్షకులు శివ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎడి రవిబాబుపై చర్యలు తీసుకోవాలి

డిఆర్‌ఒకు సిఐటియు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

సమగ్ర శిక్ష ఉద్యోగులపై కారుతో దురుసుగా వెళ్లి ఉద్యోగిని డి.రూన్నీని గాయపర్చిన అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి) రవిబాబుపై చర్యలు తీసుకోవాలని, రూన్నీకి మెరుగైన వైద్యం అందించాలని, సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం డిఆర్‌ఒ దయానిధికి ఏపీ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వివి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు, కసింకోట మండల నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడారు. సమగ్రశిక్ష అభియాన్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఈనెల 22న కశింకోట శిక్షణా క్యాంపు వద్ద తమ సమస్యలపై నిరసన తెలియజేసి, సమస్యలను విన్నవించే క్రమంలో ఈ కార్యక్రమానికి హాజరైన అడిషన్ డైరెక్టర్ రవిబాబు ఉద్యోగులపై కారుతో దురుసుగా వెళ్లి ఒక ఉద్యోగిని (నక్కపల్లి ఎంఐఎస్ కోఆర్డినేటర్) డి.రూన్నీ కాలుపై నుండి వెళ్లడంతో ఆమె కాలుకు తీవ్ర గాయమైందని చెప్పారు. ఈ ఘటనను వారు తీవ్రంగా ఖండించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు గత 3 నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మినిమం టైమ్ స్కేల్ అమలు చేయకపోవడం, రెగ్యులరైజ్ చేయకపోవడం, అరకొర జీతాలతో వెట్టిచాకిరీ చేయించుకోవడం దారుణమన్నారు. అరకొర జీతాలుసైతం నెల తరబడి బకాయి పెట్టి వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. దీనిపై బుధవారం ఉద్యోగులంతా నిరసన తెలియజేస్తే, ఎడి విచక్షణ రహితంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దురుసుగా వెళ్లిన ఎడిపై తగిన చర్యలు తీసుకోవాలని, ఆవె ఆరోగ్యం మెరుగుపడేవరకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కశింకోట : ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించి డి.రూన్నీ అనే ఉద్యోగిపై తమ కారు తొక్కించి గాయపరిచిన ఎడి రవిబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డిడి.వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళా సాధికారత సాధిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంపిపి సూరిబాబు

వైసిపి ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యారంగానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అన్నారు. అనకాపల్లి మండలం సీతానగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం సందర్శించిన ఆయన కాసేపు ఉపాధ్యాయునిగా మారి టెన్త్ క్లాస్ పిల్లలను బోర్డ్ మీద లెక్కలు వేసి విద్యార్థులు చేత జవాబులు రాబట్టారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా అక్కడ వంటకాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జంపన శివాజీ వర్మ, సచివాలయం కన్వీనర్ పోలమరశెట్టి నర్సింగరావు, ఆడారి సూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు లారీ బోల్తా

ప్రజాశక్తి- కసింకోట : కన్నూరుపాలెం వైపు నుండి అనకాపల్లి వైపు సరుగుడు లోడుతో వస్తున్న లారీ గురువారం తెల్లవారుజామున మండలంలో గురుగు భీమవరం ఎన్టీఆర్ కాలనీ వద్ద బోల్తా పడింది. ఆ సమయంలో ఆ మార్గంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఆలయ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం మండప నిర్మాణానికి చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ గురువారం శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల నుండి 10 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో మండప నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు సాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండ రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవసాయంపై మొబిలిటీ మ్యాప్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పని అవగాహన, అనుభవంపై ఎస్‌కెవైసిఎస్ వ్యవసాయ కేంద్రం విద్యార్థులు గురువారం మొబిలిటీ మ్యాప్‌ను గీశారు. మొబిలిటీ మ్యాప్ గురించి విద్యార్థులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె సభ్యులు డాక్టర్ ఎన్ రాజాకుమార్, డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, ఆర్‌బికె విఎఎ రమాదేవి, విద్యార్థులు కె.ఆలేఖ్య, ఆర్.భార్గవి, పి. దుర్గాభవాని, ఎ. గౌతమి, ఎస్. మానస పాల్గొన్నారు.

అన్నదాత గుండెల్లో వర్షం గుబులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఖరీఫ్ సీజన్లో వరి కోత దశకు చేరుకున్న సమయంలో వర్షాలు అన్నదాత గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. చాలావరకు కోతలు మొదలుపెట్టి వరి చేను మడిపై ఆరబెట్టారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకొని అక్కడక్కడ చిరుజల్లులు పడడంతో అన్నదాతల్లో గుబులు మొదలైంది. దీంతో దేవరాపల్లి మండలంలోని అన్ని ప్రాంతాలలో రైతన్నలు పొలం వైపు పరుగులు పెట్టి, మడిలోని కోసిన వరి తడిచిపోకుండా చిన్నచిన్న కుప్పలుగా పెట్టే పనిలో రైతన్నలు నిమగ్నమవుతున్నారు. వర్షం పడడంతో నష్టమే కలుగుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొలంలో కోసి ఉన్న వరి పంట

రేషన్ డిపోల్లో కందిపప్పు సరఫరా పునరుద్ధరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో రేషన్ కార్డు లబ్ధిదారులకు కొన్ని నెలలపాటు కందిపప్పు, నూనెలను పంపిణీ చేయడం లేదని, తక్షణమే కందిపప్పు, నూనెలను పంపిణీ చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బయట మార్కెట్లో రూ.170 నుండి రూ.200 మధ్య ధర పలుకుతున్న కందిపప్పును పేదలు కొనుగోలు చేయలేకపోతున్నారని తెలిపారు. కందిపప్పును ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో అధిక ధరలకు కొనుగోలు చేయలేక ప్రజలు పోషకాహారానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమది సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసిపి నేతలు 3 నెలలకు పైగా కందిపప్పు పంపిణీ చేయకపోయినా కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసరసరుకుల ధరలు పెరగడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులుపడుతున్నారని, పెరుగుతున్న ధరలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం 14 రకాల నిత్యావసర సరుకులు ప్రజలకు పంపిణీ చేస్తుందని, అదే తరహాలో రాష్ట్రంలో కూడా రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేసి పేదలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని లోకనాథం కోరారు.

ఉత్తరాంధ్రకు ఏమి చేశారు? : నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపికి చెందిన ఉత్తరాంధ్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ గత, ప్రస్తుత ఇన్‌ఛార్జులు విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి తదితరులు ఈ నాలుగున్నర సంవత్సరాలలో ఉత్తరాంధ్రకు ఏమి చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు ప్రశ్నించారు. వీరంతా ఉత్తరాంధ్రకు ఏమీ చేయకపోగా, పేదల భూములు ప్రభుత్వ భూములను, ప్రకృతి వనరులను బినామీ పేర్లతో ఆలీబాబా 40 దొంగలు మాదిరిగా బిల్డ్ ఏపీ పేరుతో ఉత్తరాంధ్రను దోచుకున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నేడు జగన్ నిజస్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, అందువల్లే సాధికార సభలకు జనాలు రావడం లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో, కరిమిశెట్టి నర్సింగరావు, జిల్లా పార్లమెంట్ కార్యదర్శి బోడి వెంకట్రావు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో గురువారం ఓటు నమోదుపై అవగాహనా సదస్సు జరిగింది. అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వరరావు, ఐక్యూ ఏసి కో-ఆర్డినేటర్ నిరంజన్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎస్ నాయుడు, సూపరింటెండెంట్ అనురాధ, ఎన్‌సిసి అధికారి ఏఎస్ఎన్ మూర్తి, బిఎంపిపి నాయుడు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం అమ్ముతున్న కల్తీ మద్యంపై సిబిఐ విచారణ జరిపించాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడుపై పెట్టిన కేసులు తప్పుడు కేసులు బహిర్గతమయ్యాయని తెలిపారు. ప్రజలలో చంద్రబాబుకున్న ఆదరణ చూసి ఓర్వలేకే తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. ఏజె సుధాకర్ రెడ్డి వైసిపి కార్యకర్తలాగా మాట్లాడుతున్నారని, న్యాయస్థానాల పట్ల అగౌరవంగా మాట్లాడిన ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

ప్రజాశక్తి-వడ్డాది : అనారోగ్యంతో మరణించిన తండ్రికి కుమార్తె తల కొరివి పెట్టి కన్న రుణాన్ని తీర్చుకున్న సంఘటన బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో గురువారం చోటుచేసుకుంది. వడ్డాది గ్రామానికి చెందిన అద్రూవ్ కొండలరావు అనే వ్యక్తి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు ఆయనకు భార్య కుమార్తె ఉన్నారు. కుమారుడు 20 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. దీంతో కుమార్తె సయ్యపురెడ్డి సూర్య ప్రభ తండ్రికి కర్మ కాండలు నిర్వహించారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యలమంచిలి : ఆటో ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గురువారం టౌన్ ఎస్ఐ పాపి నాయుడు ఆధ్వర్యంలో కూడళ్లలోని ఆటో డ్రైవర్లకు ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా పాఠశాలలకు విద్యార్థుల్ని చేర్చే క్రమంగా అత్యధిక లోడ్‌తో విద్యార్థుల్ని తరలించడం పెద్ద నేరంగా పరిగణించాలని, అటువంటి ఆటోలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలని లేదంటే కేసులు రాస్తామని హెచ్చరించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, దిమిలి రోడ్, ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లు గుమికూడుతూ ప్రాయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ప్రయాణికులు ఆరోపణలు సహించబోమన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆటో యూనియన్ నాయకులు, ప్రయాణికులు, పాల్గొన్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలో ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక సబ్ స్టేషన్ నుంచి జాగరవు, వేచలవు వారి కల్లాల వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు దొంకలో పెరిగిపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజలతో జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో పలు పంచాయతీల్లో ఒసి కేటగిరిలో మినీ అంగన్వాడీవర్కర్, అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ. వి.లలిత కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరవాడ మండలంలోని పోలిరెడ్డి పాలెం, నర్సాపురం, మసిరివానిపాలెం, విజయరామపురం గ్రామాల్లో మినీ అంగన్వాడీ వర్కర్ పోస్టులు, గొరుసువాని పాలెం, దళాయి పాలెం, దిబ్బపాలెంలో ఆయా పోస్టులు, సబ్బవరం మండలంలోని గణపతిపురంలో మినీ అంగన్వాడీ, రావలమ్మపాలెం-2, బలిజపాలెం, వంగలి-2, తవ్వవానిపాలెం-2, అమృతపురం-2, సూరెడ్డి పాలెం, నాయనమ్మ పాలెం గ్రామాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత పొంది, 21 నుండి 35 సంవత్సరాలు వయస్సు ఉండాలని, అభ్యర్థులు డిసెంబర్ 4 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

వడ్డాది : రావికమతం ఐసిడిఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసిడిఎస్ పిఒ ఈషారాణి తెలిపారు. రావికమతం మండలం తట్టబంద, గొల్ల పాలెం, బుచ్చయ్యపేట మండలం పిపి.అగ్రహారం-2, నేతవానిపాలెం, ఎం భూపతిపాలెంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు లేకపోవడంతో ఈ 5 అంగన్వాడీ సహాయకురాలి పోస్టుల భర్తీకి ఓసి అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.

దేవరాపల్లి : కె.కోటపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కె.కోటపాడు మండలం పొడుగుపాలెం-2, దేవరాపల్లి మండలం శివరామ చేనులపాలెంలో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పిఒ మంగతాయారు తెలిపారు.

నక్కపల్లి : నక్కపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నాలుగు మండలాల్లో అంగన్వాడీ కార్యకర్త -3, ఆయా - 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ శ్రీవిద్య గురువారం ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు అర్హులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పనివేళల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు .

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ శివారు కూండ్రపువానిపాలెంలో గురువారం సత్య సాయిబాబా 98వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు, పేదలకు వస్త్ర వితరణ, అన్న ప్రసాదాల వితరణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కన్నూరు అప్పలనాయుడు నక్కెళ్ల మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బ్యాంకు ఎబిఎం కొట్నాన గంగాధర్ సమకూర్చిన దుప్పట్లను వందమంది పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కింతాడ ఉప-సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ బత్తి వెంకటరమణ, టిడిపి నియోజకవర్గ నాయకులు పివిజి.కుమార్, పైలా ప్రసాదరావు సోదరుడు నాయుడు, మండల నాయకులు జూరెడ్డి రాము, రొంగలి మహేష్, పైల నారాయణమూర్తి, వెలగల పైడంనాయుడు, బండారు రామస్వామిపాత్రుడు, సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఈనెల 25వ తేదీన టిడిపి ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలతో జరిగే బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మరశెట్టి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని అర్ల పంచాయతీకి చెందిన ఆదివాసీ గిరిజన గర్భిణీని డోలిపై ఆసుపత్రికి తరలించారు. కొండ శిఖర లోసింగి గ్రామానికి చెందిన మర్రి శాంతి(22) రెండో కాన్పు కావడంతో గురువారం ఉదయం పురిటి నొప్పులతో రావడంతో డోలి కట్టి లోసింగి నుంచి నాలుగు కిలో మీటర్ల దూరంలో గల వైబి.పట్నం గ్రామానికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి ఆటోలో రోలుగుంట పిహెచ్‌సికి తరలించారు. 2020 సంవత్సరంలో గ్రామస్తులందరూ కలిపి వైబి పట్నం నుండి లోసింగి గ్రామం వరకు నాలుగు కిలోమీటర్లు సొంతంగా డబ్బులు వేసుకొని కాలి బాట నిర్మాణం చేసుకున్నారు. గ్రామంలో కనీసం ఆరోగ్య కార్యకర్త కూడా లేరని, నిండు గర్భిణీ డోలు మూసుకుని కొండలు వాగులు దాటుకుంటూ ఆసుపత్రికి తీసుకెళ్లే పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలిపారు.

డోలీలో తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు

నారాయణరావును సత్కరిస్తున్న సభ్యులు

నారాయణరావుకు వాసవీ క్లబ్ సభ్యుల సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ప్రముఖ వ్యాపారవేత్త వెలగ నారాయణరావు జన్మదిన వేడుకల సందర్భంగా వాసవి క్లబ్ కమిటీ సభ్యులు గురువారం స్థానిక కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, అందరూ బాగుండాలి, అందులో నేనుండాలి అనే నినాదంతో సమాజానికి విశేషమైన సేవలు చేస్తూ నారాయణరావు సేవారత్న అవార్డును అందుకున్నారన్నారు.అనేక సేవలు అందిస్తున్న నారాయణరావు ప్రభుత్వం నుంచి ఉత్తమ సమాజ సేవకుడు అవార్డును అందుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో వైద్యులు సిఎస్ కుమార్, పెనుగొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను గురువారం ఎంఈఓ నరేష్, డిఈ ప్రసాద్ పరిశీలించారు. పాఠశాలలో అదనపు తరగతి గదులకు స్లాబ్ వేశారు. నాణ్యతగా పనులు చేపట్టి, సకాలంలో భవన నిర్మాణంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, వెంకటేష్, హెచ్ఎం, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న అధికారులు

ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని దుగ్గాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మాదాలమ్మ ఆలయాన్ని గురువారం నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం అందించిన 10లక్షల నిధులతో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎంపిపి సుర్ల రాజేశ్వరి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో భక్తులు పోటెత్తారు. గురువారం కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయం లో అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. వేకువ జాము నుండి భక్తుల రద్దీతో ఆలయం కిటకిట లాడింది.

రద్దీగా ఉన్న ఆలయం


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నాతవరం మండల జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స భర్త, వైసిపి సీనియర్ నాయకులు కాపారపు వెంకటరమణ గతంలో గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కృషి మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.4లక్షలను మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ చెక్కును అప్పలనర్స కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎంపిపి సాగిన లక్ష్మణమూర్తి, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ

రోడ్డు భద్రతపై శ్రీచైతన్య విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-పాయకరావుపేట:స్థానిక శ్రీచైతన్య స్కూలు ఆధ్వర్యాన గురువారం స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు-భద్రత అనే అంశంపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలందరూ ప్లకార్డులు పట్టుకొని హెల్మెట్ ఉపయోగించండి, తాగి వాహనాలు నడపొద్దు, రోడ్డు నియమాలు పాటించాలని నినాదాలు చేశారు. వై-జంక్షన్‌లో మానవ హారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. లేకుంటే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారన్నారు. పాఠశాలల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ, రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న వారిపై చర్యలు చేపట్టాలన్నారు.పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ప్రిన్సిపల్ మాణిక్యాలరావు మాట్లాడుతూ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయ్, డీన్ విజయ్, సి ఇంచార్జి లోవేష్, ప్రైమరీ ఇంచార్జెస్ వేణి ప్రియ పాల్గొన్నారు.

వేడుకగా మరిడమ్మ ఉత్సవం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఎంకె.పట్నం గ్రామంలో గురువారం మరిడమ్మ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో భక్తులందరికీ అన్నసమారాధన కార్యక్రమంను మడ్డు నాయుడు, లక్ష్మీ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు హాజరై అమ్మవారిని దర్శించుకొని అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

ప్రజాశక్తి-గొలుగొండ:సత్య సాయిబాబా 98వ జయంతిని పురస్కరించుకొని ఏఎల్‌పురం శ్రీసత్యసాయి సేవా సమితిలో సుప్రభాత సేవ, నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. 88 మంది పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ పురం, పాతకృష్ణదేవిపేట శ్రీసత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

కోటవురట్ల మండలంలో ఎండపల్లిలో పాల్గొన్న నేతలు

ప్రజాశక్తి - పరవాడ:వైసిపి పాలనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ముత్యాలమ్మ పాలెం పంచాయతీలో వైసిపి సచివాలయం కన్వీనర్ బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ అమర్చిన డిస్ ప్లే బోర్డుని ఆవిష్కరించారు. వైసిపి జెండాను ఎగురవేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను ఇతర నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో 'జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమం జడ్‌పిటిసి సంధ్యారాము ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దానికి ముఖ్య అతిథిగా ఎంపిపి బోదెపు గోవింద్ హాజరై వైసిపి ప్రభుత్వం అమలు చేసిన పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి త్రినాధ్, అచ్చియ్యనాయుడు, కరణం రవి, ప్రతాప్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక సచివాలయం-02 పరిధిలో ఎపికి జగన్ సీఎం ఎందుకు కావాలి కార్యక్రమాన్ని స్థానిక వైసీపీ నాయకులు గురువారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సర్వే నిర్వహించారు. మండల వైసీపీ అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చం నాయుడు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు టెక్కలి వీర కొండలరావు, బొడ్డేటి మహేష్, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును గురువారం ఎంపిపి కలగా కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు ఆవిష్కరించారు. జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నమ్మి గణేష్, మలసాల కిషోర్, అద్దంకి సతీష్, లగిసెట్టి గణేష్, పాల్గొన్నారు

బుచ్చయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేట గ్రామంలో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు, స్థానిక సర్పంచి ఎల్లపు విజయ్ కుమార్, దొండ నారాయణమూర్తి పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలోని ఎండపల్లి గ్రామంలో గురువారం జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం స్థానిక సర్పంచ్ పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. మండల వైసిపి అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ పర్యటన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఈఓపిఆర్‌డి బానోజీరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌దే

ఆరిలోవ : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని వైసిపి తూర్పు సమన్వయకర్త, ఎంపి ఎంవివి.సత్యనారాయణ అన్నారు. గురువారం 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతి దాస్ ఆధ్వర్యంలో సంజయ్‌గాంధీ కాలనీలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనుల వివరాల బోర్డును ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు ఉమ్మిడి దాసు, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సీతమ్మధార : 14వ వార్డులో కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే. కార్యక్రమం నిర్వహించారు. బిఎస్ లేఅవుట్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. తమిళ్ కల్యాణ మండపంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులు వివరాలు బోర్డు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద్, పార్టీ మండల అధ్యక్షులు జివి రమణి, 14వ వార్డు నాయకులు బల్లా శ్రీనివాసరావు, కోడూరి సుశీల, కె.సత్యనారాయణ, రాజ కుమారి, సతీష్, తులసిరామ్, లింగేశ్వరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గోపాలపట్నం : 92వ వార్డు వెంకటాపురంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గంలో రూ.20.51కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామని, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఆడారి ఆనందకుమార్‌ను గెలిపించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు జి. అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వరలక్ష్మి, నీలాపు లోకేష్ రెడ్డి, బలిజ అభిరామ్, మనోహర్, జగదీష్, సురేష్, బాలు, ఉప్పిలి కనకరాజు, కంపర రామకృష్ణ, పీతల అప్పలరాజు, శంకరరావు, చిన్ని నానాజీ, ఉరుకూటి అప్పలరాజు,ఊరుకూటి అప్పారావు పాల్గొన్నారు.

ఎంపిపి కాలనీ : జివిఎంసి 16వ వార్డు పరిధి కెఆర్ఎం.కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, తూర్పు నియోజకవర్గ పరిశీలకులు మొల్లి అప్పారావు ఆధ్వర్యాన నిర్వహించారు. తూర్పు వైసిపి సమన్వయకర్త, ఎంపీ ఎంవివి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలు, గెడ్డల ఆధునీకరణ పనులు, వైద్య కేంద్రాలు, నాడు- నేడు నిధులతో పాఠశాలల అభివృద్ధి జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కందిమల్ల రాజశేఖర్, నాయకులు మధు, రాంబాబు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ ఎంవివి సత్యనారాయణ

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజల ముంగిటకే పాలన

ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. గురువారం మండలంలోని వేములపూడి పంచాయతీలో సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ముంగిటకే పాలన అందించేందుకు ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతీ 2వేల జనాభా కలిగిన ప్రాంతంలో ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీంతో ప్రజల ముంగిటకే ప్రభుత్వం సేవలు అందుతున్నాయన్నారు. రైతుల సౌకర్యార్థం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్మించడం జరిగిందని, ఆ కేంద్రాల్లో రైతులకు సంబంధించిన అన్ని సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి, సీనియర్ నాయకులు బోళెం నరసింహామూర్తి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మ్యాజిక్ చేస్తున్న మెజీషియన్

ఆకట్టుకున్న సైన్స్ మ్యాజిక్ ప్రదర్శనలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నేషల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా గురువారం మండలంలోని వేములపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్సీపట్నం కారుణ్య హైస్కూల్‌లో సైన్స్ మ్యాజిక్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు విశేష స్పందన లభించింది. జన విజ్ఞాన వేదిక సీనియర్ మెజీషియన్ శ్రీరాములు మ్యాజిక్ ప్రదర్శనలో విద్యార్థులను ఉర్రూత లూగించారు. ముందుగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ, చదువుకున్న వారు కూడా మూఢనమ్మకాల బారిన పడి మోసపోతున్నారన్నారు. విద్యార్థులు సైంటిఫిక్ టెంపర్ కలిగి ఉండాలన్నారు. మెజీషియన్ శ్రీరాముల ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకర్షించాయి. ప్రధానో పాధ్యాయులు. ఎం. రామకృష్ణ మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు.

పనులు ప్రారంభిస్తున్న జడ్పిటిసి రాంబాబు

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలో కందపూడి లక్కరాజు వారి కల్లాల వద్ద తాగునీటి బోరు పనులను జడ్పిటిసి దొండా రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి అవసరాలకు నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గోపిశెట్టి శ్రీనివాసరావు, కోవెల ఈశ్వరరావు, ఎంపీటీసీ సీత సన్యాసినాయుడు, గుడాల ఆనంద, పెద్దాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న రీ సర్వేలో అక్రమాల పై

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కొత్తకోట: ఆదివాసీ గిరిజనులు జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై తక్షణమే జిల్లా జాయింట్ కలెక్టర్‌తో సమగ్రంగా విచారణ చేపట్టి, జగనన్న రీ సర్వేలో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ ఇన్స్పెక్టర్‌పై (ఆర్ఐ) సమగ్రమైన దర్యాప్తు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం రావికమతం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాంగి చంద్రయ్య తదితరులు మాట్లాడుతూ, చీమలపాడు శివారు అజయ్‌పురం గ్రామానికి చెందిన 11 మంది ఆదివాసీ చిన్నారుల జన్మదిన ధ్రువ పత్రాలు మంజూరు కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తులు చేయగా, నేటికీ ఆరు నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ధ్రువ పత్రాల మంజూరు కాలేదన్నారు. జగనన్న రీ సర్వేలో బుడ్డిబంద, కవ్వుకుంట ఆదివాసి గిరిజన భూములను గిరిజనేతరులకు అప్పగించిన డిఫారం పట్టాలను తక్షణమే రద్దు చేసి. తక్షణమే గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. డి పారం భూముల అన్యాక్రాంతానికి కారుకులైన ఆర్ ఐ పై చర్యలు చేపట్టాలన్నారు. జగన్నకు చెబుదాం పిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 20న మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు సమస్య లపై దరఖాస్తులు ఇవ్వగా నేటికి పరిష్కారానికి నోచుకోలేదని దుయ్యబట్టారు. మండలంలో సుమారు 18 గ్రామాలల్లో అటవీ భూముల సాగుదారులకు పట్టాల మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు చేస్తే నేటికీ అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టలేదని తెలిపారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్‌డివో)రెండు పర్యాయాలు వీటికి సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించినా ఫలితం లేదన్నారు. ఈ సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ తో సమగ్ర విచారణ చేయాలని గోవిందరావు, చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గేమిల రాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత గోవిందరావు

స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని పందూరు గ్రామంలో స్పందన ఫిర్యాదుల పట్ల తహసిల్దార్ జానకమ్మ గురువారం పరిష్కారానికి విచారణ చేపట్టారు. బంధ సమీపంలో పంట కాలువ ఆక్రమణకు గురైందంటూ వెలగా సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమీప ప్రాంతం పరిశీలించి విచారణ చేపట్టారు. తక్షణమే ఆక్రమణకు గురైన ప్రాంతం పై చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారికి సూచించారు.అసైన్డ్ భూముల సాగుదారులకు పట్టాలు అందజేయాలని గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా సదరు అంశం కోర్టు వివాదంలో ఉన్నందున ఫిర్యాదు దారులకు విషయం వివరించినట్లు తహసిల్దార్ జానకమ్మ తెలిపారు.

విచారణ చేపడుతున్న తహశీల్దార్

నగరంలో క్రికెట్ సందడి

భారత జట్టు క్రీడాకారులు

అచ్చొచ్చిన మైదానంలో భారత్ అదరగొట్టింది. బ్యాట్స్‌మెన్లు సత్తా చాటడంతో భారత్ విజయం సాధించింది. ఈ గెలుపుతో ఈ టి-20 సిరీస్‌లో భారత్ బోణీ కొట్టింది. దీంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. స్టేడియం బయట, లోపల అభిమానుల సందడి నెలకొంది.

ఆస్ట్రేలియా క్రీడా కారులు



స్టేడియం బయట అభిమానుల సందడి

జెండాను ఎగుర వేస్తున్న క్రీడాకారుడు

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అధ్వాన్న రోడ్లపై ర్యాలీ

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని వడ్డిప గ్రామం నుండి ఏటిగైరంపేట వరకు రోడ్డు నిర్మించాలని జనసేన పార్టీ చోడవరం నియోజవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యంలో గురువారం ఆటో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ తొలుత వడ్డిప గ్రామం నుండి ప్రారంభమై రత్నంపేట, బిబి.పట్నం, ఎంకె.పట్నం మీదుగా బిబి.పట్నం ఎంకె.పట్నం నుంచి ఏటిగైరంపేట వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పివిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల నుండి ఈ రోడ్డు నిర్మాణం చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ రోడ్డును నిర్మించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బలిజ మహారాజు, ప్రధాన కార్యదర్శి పరవాడ దొరబాబు, మైచర్ల నాయుడు, గూనూరు మూలు నాయుడు పాల్గొన్నారు.

ఆదివాసి గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలం లోని సుంకరమెట్ట పంచాయతీ దండబాడు గ్రామంలో గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం మూడు నెలల నుంచి 70 కుటుంబాలకు ఇవ్వలేదని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం రేషన్ కార్డుదారులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు రామారావు మాట్లాడుతూ, సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేదలకు ప్రతినెలా గిరిజనులకు బియ్యం అందలేదన్నారు.స్పందించిన తహశీల్దార్ రెండు నెలలు బియ్యం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు కె.దేవన్న వార్డు మెంబర్ సిహెచ్ చిన్న అంకుల్, పి.మొద్దు, పి కుమోన్, కె.రాంబాబు పాల్గొన్నారు.